క్లుప్తంగా

మహిళా పారిశ్రామికవేత్తలకు ఎస్‌బీఐ శిక్షణ



మహిళా పారిశ్రామిక వేత్తలతో రవికిషోర్ తదితరులు

ఎంవీపీకాలనీ: విశాఖలోని ఎస్‌బీఐ ఎస్‌ఎంఈ సెంటర్ ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామిక వేత్తల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిజినెస్ అమృధి పేరుతో ఈస్ట్‌పాయింట్ కాలనీలోని ఓ హోటల్‌లో శనివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త, సాంకేతిక నిపుణుడు రవికిషోర్ మాట్లాడారు. వ్యాపారంలో క్రమబద్ధమైన, స్థిరమైన, అద్భుతమైన వృద్ధిని సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పెట్టుబడి పెట్టడానికి అనువైన కీలకరంగాలను మహిళా పారిశ్రామిక వేత్తలకు వివరించారు. సాధికారత దిశగా మహిళలు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఈ సెంటర్ ఏజీఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి నగరంలోని ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు.

శ్రావ్యంగా హరికథ



పురందరదాసు జీవిత గాథను వినిపిస్తున్న నారాయణ ఆచార్యులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హరికథ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో పురందరదాసు జీవిత చరిత్రను శ్రావ్యానందకరంగా నెల్లూరుకు చెందిన భాగవతార్ శ్రీ నారాయణ ఆచార్యులు వినిపించారు. కార్యక్రమాన్ని గాత్ర విద్వాంసురాలు పంతుల రమ, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పురందరదాసు జీవత గాథ ఎంతో రమ్యంగా గీతాలపన ద్వారా వినిపించి అలరించారు. అనంతరం ప్రేక్షకులకు ప్రసాదం అందజేశారు.

పూర్వ విద్యార్థుల సందడి



బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థులు

సీతంపేట: వారంతా బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థులు... 1974 నుంచి 1977 వరకు బీకాం చదివి వెళ్లిపోయినవారు మళ్లీ ఇప్పుడు కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాల గురించి ఆరా తీసుకున్నారు. అప్పటి మధురస్మృతులను నెమరవేసుకుని పరవశించిపోయారు.ఈ అపూర్వఘట్టానికి నగరంలోని ఓ హోటల్ వేదికైంది. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కళాశాల స్థాపించిన తర్వాత రెండో బ్యాచ్‌లో సుమారు 52 మంది విద్యార్థుల్లో 38 మంది శనివారం కలుసుకున్నారు. వీరిలో చాలా మంది డాక్టర్లు, లాయర్లు, వ్యాపారవేత్తలు, ఇంజినీర్లుగా, బ్యాంకు మేనేజర్లుగా స్థిరపడ్డారు. కొందరు పదవీ విరమణ చేశారు. పూర్వ విద్యార్థుల కలయికకు కృషి చేసిన రామారావు, హనుమంతరావు, రాంబాబు, చందు, ఎంవీ సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, రమ, ఉమ, చలపతి, రామమూర్తిలను సహచరులు అభినందించారు.

బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార, పారిశ్రామిక రూపకల్పన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'ఓపెన్ గ్రూప్' అనే అంతర్జాతీయ సంస్థ 7 అంశాల్లో పోటీ నిర్వహించింది. దీనిలో లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని మండపాక కామాక్షి పద్మవృతిక సారథ్యం వహించిన బృందం పాల్గొంది. మెంటార్లు రాజశేఖర్ వాసా, అనిల్ పైంగాంకర్ ఈ బృందానికి మార్గదర్శనం చేశారు. శనివారం విద్యార్థుల బృందాన్ని కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి అభినందించారు.

పట్నంలో పల్లె అందాలు

సంప్రదాయ విగ్రహాల ఏర్పాటుతో ఆకర్షణీయంగా కూడళ్లు



మోపెడ్‌లో ప్రయాణిస్తూ విగ్రహాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న మహిళ



డెయిరీ ఫారం కూడలి వద్ద మట్టి కుండలు పట్టుకొని కూర్చొన్న మహిళ విగ్రహం



తలపై తాటాకుల గొడుగు వేసుకొని బుట్ట పట్టుకొని పొలంలోకి వెళ్తున్న రైతు



పారతో పొలం పనిచేస్తున్న రైతు విగ్రహం

జీవీఎంసీ అధికారులు అభివృద్ధి చేసిన ప్రధాన కూడళ్లు నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై పాత డెయిరీ ఫారం కూడలిలో గ్రామీణ వాతావరణం సృష్టించారు. ఇక్కడ ఎద్దుల బండి, మట్టి కుండలతో కూర్చొన్న పల్లెటూరి మహిళ, పార, బుట్ట చేత పట్టుకొని, ఎండ, వానకు తడవకుండా తలపై చిన్న తాటాకుల గొడుగులు వేసుకొని పొలంలోకి వెళ్తున్న రైతులు విగ్రహాలు ఏర్పాటు చేశారు. అటుగా ప్రయాణిస్తున్న వాహన చోదకులు, స్థానికులను ఈ విగ్రహాలు ఎంతగానో ఆకర్షిస్తూ మైమరపిస్తున్నాయి. దీంతో పాటు పెదవాల్తేరు కూడలిలో ఇటీవల ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహం స్థానికులను కనువిందు చేస్తోంది. – ఆరిలోవ

నగరంలో తాండవ కృష్ణుడు



పెదవాల్తేరు జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తాండవ కృష్ణుడి విగ్రహం



కూడలిలో ఎద్దుల బండి

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్–2024లో ఉత్తీర్ణత లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఆ రోజు ఉదయం 10 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు సీట్ల ఖాళీల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్‌ను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్(టీసీ), 4 నుంచి 10 తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఈడబ్ల్యూఎస్ అర్హత ఉన్నవారు సంబంధించి ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలను తీసుకువాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల రోజున రిజిస్ట్రేషన్ ఫీజు, కళాశాల ఫీజుతో కలిపి సుమారు రూ.5,500 సీటు పొందిన వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో స్వల్ప ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- 36 గ్రాముల బంగారం స్వాధీనం
- క్రైం డీసీపీ వెంకటరత్నం వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వెంకటరత్నం తదితరులు

ఎంవీపీకాలనీ: గత కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడ్ని ఎంవీపీ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటనపై నగర క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు, ఎంవీపీ క్రైం సీఐ సీహెచ్ శ్రీనివాసరావులు శనివారం రాత్రి ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద జాలరిపేట, గాంధీ సెంటర్ సమీపంలోని గెంబలి శారద ఇంట్లో ఈ నెల 22 రాత్రి దొంగతనం జరిగింది. పెద్ద ఎత్తున బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు ఆదేశాలతో ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్ఐ జగదీష్ ఇతర సిబ్బంది ప్రత్యేక టీమ్‌గా ఏర్పాడి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితుడి కోసం గాలించారు. అదే ప్రాంతానికి చెందిన గుత్రపు శివ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో అతనిపై నిఘా పెట్టి శనివారం చాకచక్యంగా పేదవాల్తేర్ ఆర్టీసీ డిపో సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించాడు. 36.76 గ్రాముల బంగారం, 2,604 గ్రాముల వెండితో పాటు రూ.31,200లు స్వాదీనం చేసుకున్నారు. అయితే గుత్రపు శివపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతను చెడు వ్యసనాలకు బానిసై వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో అతని నుంచి మరిన్ని వివరాలు రాబడుతున్నారు. కేసు ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జగదీష్‌ల బృందానికి క్రైమ్ డీసీపీ ఏ.వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు అభినందనలు తెలిపారు.

పెండింగ్ ఎరియర్స్ చెల్లించాలని వినతి



ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు బకాయి ఉన్న ఆర్పీ ఎఫ్ ఎరియర్స్‌ను చెల్లించాలని నేషనల్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం ఎన్‌ఎంయూఏ ప్రతినిధులతో కలిసి విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో రాష్ట్ర డీజీపీ, ఆర్టీసీ వైస్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలను ద్వారకా తిరుమలరావుకు వివరించామని చెప్పారు. 50 శాతం బకాయి ఎరియర్స్‌ను చెల్లించాలని కోరామన్నారు. 1/2029 సర్క్యులర్‌ను అమలు చేయకుండా కొంత మంది అధికారులు ఉద్యోగులపై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్న విషయాన్ని వివరించామన్నారు. పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. డ్రైవర్లు, కండక్టర్ల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. వీటిపై వైస్ మేనేజింగ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

29న సి.నా.రె. పురస్కారాల ప్రదానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం: ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల 29వ తేదీన ఆత్రేయ కళాపీఠం ఆధ్వర్యంలో సినారె పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నామని కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శనివారం శివాజీపాలెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన వేదిక కేంద్రంలో ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. న్యూ రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించే సంగీత విభావరిలో సినారె కలం నుంచి జాలువారిన గీతాలను గాయకులు ఆలపిస్తారని తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ శ్రీభరత్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ, గంటా శ్రీనివాసరావు హాజరు కానున్నారని చెప్పారు. వారి చేతుల మీదుగా సినారె పురస్కారాలను అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎస్ఎస్ఎన్ రాజు, సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



ఉపాధ్యాయులతో డీఈవో చంద్రకళ

డీఈవో చంద్రకళ

పెందుర్తి: ఉపాధ్యాయులు కచ్చితంగా సమయ పాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. బాల్యాన్ని గౌరవించాలని..పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి, హెచ్‌ఎం చిన్మయి, పెందుర్తి ఎంఈవో–2 మధుమూర్తి పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్‌గా పాల్ కిరణ్



ఆరిలోవ: విశాఖ రూరల్(చినగదిలి మడలం) తహసీల్దార్‌గా పాల్ కిరణ్ బదిలీపై రానున్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందర్ ప్రసాద్ శనివారం దీనికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పనిచేసిన ఎస్.శివన్నారాయణకు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ జరిగింది. ఆయన ఎన్నికల సమయంలో మన్యం జిల్లా కురుపాం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా నుంచి పాల్ కిరణ్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. పాల్ కిరణ్ 2022 జూలై నుంచి సుమారు ఏడాది పాటు విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పనిచేశారు.

ఏడాకుల చెట్లతో మానవాళికి హాని



మాట్లాడుతున్న శ్యామ్ ప్రసాద్

బీచ్‌రోడ్డు: మానవాళి అనారోగ్యానికి కారణమవుతున్న ఏడాకుల చెట్ల(కొనొకార్పస్ చెట్లు)ను వెంటనే తొలగించాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రామ్‌నగర్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగర వ్యాప్తంగా పచ్చదానం కోసం 15 ఏళ్లుగా జీవీఎంసీ ఈ ఏడాకుల మొక్కలను నాటిందన్నారు. ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో ఈ చెట్లు పుప్పొడి రేణువులు మానవాళికి అత్యంత ప్రమాదకరమని తేలిందని చెప్పారు. వీటి ద్వారా మానవులకు శ్వాసకోశ వ్యాధులు, అస్తమా, అలర్జీ వస్తుందన్నారు. ఈ చెట్లను గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై జీవీఎంసీ అధికారులతో పాటు గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వి.రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

హెపటైటిస్ కేసులపై అప్రమత్తం

బీచ్‌రోడ్డు: నగరంలో హెపటైటిస్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, దీనిపై ఆరోగ్య శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ సిహెచ్.ఫణికృష్ణ సూచించారు. హెపటైటిస్ కేసుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం ఒక హోటల్ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. హెపటైటిస్ బారిన పడకుండా ఉండేందుకు ప్రజలకు టీకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉందన్నారు. హెపటైటిస్ అత్యంత ప్రమాదకరమైన కాలేయ సంక్రమ వ్యాధని, దీంతో ప్రతి రోజు 10 నుంచి 15 మంది రోగులు ఆస్పత్రులకు వస్తున్నారని తెలిపారు. హెపటైటిస్ 14 నుంచి 28 రోజుల తరువాత బయటపతుందన్నారు. కామెర్లు, జ్వరం, అనారోగ్యం, ఆకలి లేకపోవడం, అతిసారం, వికారం, వాంతులు, కడుపులో అసౌకర్యం వంటి లక్షణాలను ముందుగా గుర్తించి తక్షణమే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.

మెడికవర్ హాస్పిటల్‌లో 'షీ క్లినిక్స్' ప్రారంభం



షీ క్లినిక్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ఉషాదేవి తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన షీ క్లినిక్స్‌ను విశాఖ పోర్టు అథారటీ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ సీఎంవో డాక్టర్ ఎస్.ఉషాదేవి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వర్కింగ్ ఉమెన్ కోసం ప్రత్యేకంగా క్లినిక్స్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. హాస్పిటల్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతీ శనివారం ఉచిత గైనకాలజిస్ట్ సంప్రదింపులతో పాటు టెస్టుల్లో 30శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఉద్యోగం చేసే మహిళలంతా ఈ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. అధునాతన వైద్యపరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పప్పు శాంతి, డాక్టర్ కిరణ్మయి గొట్టాపు, డాక్టర్ తనూజ ప్రియదర్శిని, డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం



విద్యార్థికి బహుమతి అందిస్తున్న అతిథులు



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కేడీపీఎం స్కూల్ ప్రధానోపాధ్యాయిని సుమతి బాయ్ అన్నారు. కలాం 9వ వర్ధంతిని పాఠశాలలో బీజేపీ మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమతి బాయ్ మాట్లాడుతూ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, అబ్దుల్ కలాం దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత దేశానికి సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కలాం జీవిత ప్రయాణం, సాధించిన ఘనతలను బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతాడ మోహన్‌రావు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ బాషా, మహిళ విభాగం నాయకురాలు సుజాత పాల్గొన్నారు.

విద్యార్థుల నివాళులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పరిధి వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ జ్యోతి మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవితం చిన్నారులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన బాటలో నడవాలని సూచించారు. అనంతరం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

మొక్కల సంరక్షణ విద్యార్థుల బాధ్యత



పైనాపిల్ కాలనీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈవో అనురాధ, విద్యార్థులు



తోటగరువు హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు వారం రోజులుగా సందడిగా జరుగుతున్నాయి. శనివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పైనాపిల్ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తోటగరువు హైస్కూల్ ఆవరణలో చినగదిలి మండలం ఎంఈవో అనురాధ, ప్రధానోపాధ్యాయిని జి.కె.డి.భవాని ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పలు రకాల మొక్కలు నాటించారు. ఆయా మొక్కలను సంరక్షించే బాధత్యను విద్యార్థులకు అప్పగించారు. ప్రతి రోజూ వాటిని సంరక్షించాలని హెచ్‌ఎం విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన పథకం జిల్లా కో ఆర్డినేటర్ శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంఈవో అనురాధ 13వ వార్డు పైనాపిల్ కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయులు, పిల్లలు వారి తల్లిదండ్రులతో కలసి మొక్కలు నాటారు. వాటిని సంరక్షించాలని ఎంఈవో విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు, మహిళలు

ఎంవీపీకాలనీ: మహిళల రక్షణ చట్టాలపై జాలరిపేటలో శనివారం విస్తృతంగా అవగాహన కల్పించారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా జాలరిపేట జీవీఎంసీ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎన్‌ఎం సత్యవతి, వాసవ్య మహిళ మండలి కో–ఆర్డినేటర్ షర్మిల మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు ఆయా చట్టాల ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. దాడులకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలకు మహిళ డిమాండ్ చేసే వీలుందన్నారు. న్యాయపరమైన సహకారం కోసం ఉమెన్ సెల్స్, మహిళా న్యాయ ప్రాధికార సంస్థల సేవలను వినియోగించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ సెంటర్ టీచర్ విజయ పాల్గొన్నారు.